


లింగంపల్లి చౌరస్తాలో ఫ్లైఓవర్‌ను నిర్మిస్తుండటంతో తీవ్ర ట్రాఫిక్ జాం ఏర్పడుతున్నది. అరకిలోమీటర్ దూరం వెళ్లేందుకు అరగంట సమయం పడుతున్నదని వాహనదారులు తెలిపారు.


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, బుధవారం 20 నవంబర్ 2024 | HYDERABAD




ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం కోసం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసినట్టు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వెల్లడించారు. ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట్ ఓఆర్‌ఆర్ జంక్షన్, ప్యారడైజ్ నుంచి డెయిరీ ఫామ్(ఎన్‌హెచ్-44) వరకు నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ భూ సేకరణ ను వేగవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళ వారం జరిగిన సమావేశంలో రెవెన్యూ గ్రామాల వారీగా భూ సేకరణపై సమీక్షించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి, డీఆర్ఓ వెంకటచారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, సబ్ రిజిస్ట్రార్లు, సర్వేయరు పాల్గొన్నారు. - సిటీబ్యూరో, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ)

## అక్రమ తవ్వకాలతో ఒరిగిన భవనం

కొండాపూర్, నవంబర్ 19: ఐటీ కారిడార్‌కు కేరాఫ్‌గా ఉన్న గచ్చిబౌలిలో అక్రమ నిర్మాణాలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. కొండాపూర్ డివిజన్ సిద్ధిక్‌నగర్‌లో ఓ నిర్మాణదారుడు కనీస ప్రమాణాలు పాటించకుండా బహుళ అంతస్తుల నిర్మాణం పుట్టింగుల కోసం తీసిన గుంతల కారణంగా పక్కనే ఉన్న భవనాలను ప్రమాదంలో పడేసింది. ఎటువంటి సెట్ బ్యాక్ లేకుండా తీసిన గుంతలతో పక్కనే ఉన్న నాలుగంతస్తుల భవనం ఓ వైపునకు ఒరిగింది. శేరిలింగంపల్లి సర్కిల్ -20 పరిధి.. కొండాపూర్ డివిజన్ సిద్ధిక్‌నగర్ రోడ్డు నం.1లో ఓ బిల్డర్ 200ల గజాల స్థలంలో భారీ బహుళ అంతస్తుల నిర్మాణ పనులు చేపట్టాడు. గత వారం రోజులుగా పుట్టింగుల నిర్మాణం కోసం గుంతలు తవ్వి పిల్లర్ల నిర్మాణ పనులు చేపట్టారు. ఎలాంటి ప్రమాణాలు పాటించకుండా, కనీస సెట్‌బ్యాక్‌లు వదలకుండా గుంతలు తవ్వడంతో పక్కనే ఉన్న ప్లాట్ నంబర్ 1639లోని లక్ష్మణ్ అనే వ్యక్తికి చెందిన నాలుగంతస్తుల భవనం పిల్లర్లు బయటకు వచ్చి ఓ పక్కకు ఒరిగింది. భవనంలో ఉంటున్న వారు ఒక్కసారిగా భయాందోళనకు గురై బయటకు పరుగులు తీశారు. స్థానికులు గమనించి వెంటనే పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్ బృందం, హైడ్రా సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. భవనంలో ఉన్న వారిని ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతానికి తరలించారు. మరో వైపు ఈ భవనం చుట్టు ప్రక్కల భవనాల ప్రజలను సైతం అధికారులు ఖాళీ చేయిస్తున్నారు. ఎలాంటి సెట్‌బ్యాక్ లేకుండా కేవలం 60గజాల స్థలంలో నాలుగంతస్తుల భవనం నిర్మించగా, దాని పక్కనే మరో వ్యక్తి 200ల గజాల స్థలంలో భారీ బహుళ అంతస్తుల భవనం నిర్మించేందుకు గుంతలు తవ్వడంతో మొత్తం భవనాలకు ప్రమాదకరంగా మారింది.

### అక్రమ నిర్మాణాలను గాలికొదిలేసిన టౌన్‌ప్లానింగ్ అధికారులు

ఎలాంటి అనుమతులు లేకుండా, కనీస ప్రమాణాలు పాటించకుండా ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీస ప్రమాణాలు పాటించకుండా నిర్మాణాలు చేపట్టడంతోనే ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు వాపోతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధి సైతం అంజయ్యనగర్, సిద్ధిక్‌నగర్‌లో కొనసాగే అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తున్నారని ఆరోపిస్తున్నారు.



సిద్ధిక్‌నగర్‌లో పక్కకు ఒరిగిన భవనం

## లోడ్ పెరిగితే ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టుకోవాలా?

**ఆ భారం అపార్ట్‌మెంట్ వాసులపై వేస్తారా?**

**కరెంట్ నిర్వహణ, సరఫరా చేతకాక ప్రజలను ఇబ్బంది పెట్టే తుగ్లక్ చర్యలు ఆపాలి**

**ఈ విషయంలో సీఎం తక్షణమే స్పందించాలే.. లేదంటే పోరాటమే..**

**బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



హైదరాబాద్/ హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరంలో అదనంగా విద్యుత్ వినియోగం పెరిగిందంటూ దానికి ప్రజలే వ్యక్తిగతంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకోవాలని జనంపై భారం మోపేందుకు సిద్ధమైన ప్రభుత్వ తీరుపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. నగరంలోని అపార్ట్‌మెంట్ సముదాయాల్లో విద్యుత్ వినియోగం 20 కిలోవాట్ (కేవీ) దాటితే ఆయా అపార్ట్‌మెంట్ వాసులు సొంతంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకోవాలని టీఎస్ఎస్పీడీసీఎల్ నోటీసులిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెరిగిన విద్యుత్ వినియోగానికి అనుగుణంగా నిర్వహణ చేతగాక ప్రభుత్వం ప్రజలపై భారం వేసే తుగ్లక్ చర్యకు పూనుకుందని ధ్వజమెత్తారు. విద్యుత్ ట్రాన్‌ఫార్మర్ల విషయంలో ప్రజలపై ఎలాంటి భారం మోపకుండా వాటిని ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ వినియోగం పెరిగితే ఆ భారం ప్రజలపై వేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం భవిష్యత్‌లో వినియోగం పెరిగిందని పైప్‌లైన్లు, రోడ్లను కూడా వేసుకోమని అనేట్టు ఉందని అనుమానం వ్యక్తం చేశారు. పెరిగిన అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్న విషయాన్ని రేవంత్‌రెడ్డి సర్కార్ మరిచిపోయినట్టు ఉందని ఎద్దేవా చేశారు.



### రూ. 300 కోట్ల అదనపు భారం..

20 కేవీల విద్యుత్ లోడ్ దాటిన అపార్ట్‌మెంట్‌లో సొంతంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాలంటే ఒక్కో అపార్ట్‌మెంట్‌కు దాదాపు రూ. 3 లక్షలు అవసరమవుతాయని కేటీఆర్ పేర్కొన్నారు. ఒక్కో కుటుంబంపై రూ. 30వేల నుంచి రూ. 50 వేలు భారం వేసేందుకు నిర్ణయం తీసుకోవటమేనన్నారు. ఈ లెక్కన హైదరాబాద్‌లో 20 కేవీ పైగా విద్యుత్ వినియోగం చేసే అపార్ట్‌మెంట్‌లలో కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకుంటే ప్రజలపై రూ.300 కోట్ల భారం పడుతుందని వివరించారు. పూర్తిగా ప్రభుత్వ ఖర్చుతోనే ఆ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన ఈ చర్య ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. వినియోగం పెరిగితే అందుకు అనుగుణంగా చేపట్టాల్సిన చర్యలు తీసుకోకుండా ప్రభుత్వం తప్పించుకోవటం సిగ్గుచేటని ఆయన మండిపడ్డారు. ప్రజలకు మౌలిక వసతుల కల్పన బాధ్యత ప్రభుత్వానిదేననే విషయాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గుర్తించాలన్నారు.

### కరెంట్ కోతలపై ప్రశ్నిస్తే..

200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తారని ఆశపడి ఓట్లేసినందుకు రేవంత్‌రెడ్డి ప్రజలకు షాక్ ఇస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేయకుండానే అనుమతించిన అధికారులను, వాటిని అమ్మిన బిల్డర్లను వదిలేసి అపార్ట్‌మెంట్‌వాసులపై భారం మోపుతారా అని ప్రశ్నించారు. ఇప్పటికే లోడ్ పెరిగిందని అప్రకటిత కరెంట్ కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కరెంట్ కోతలపై ప్రశ్నిస్తే ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకోవాలంటూ నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం చర్య ఎట్టి పరిస్థితుల్లో సమర్థించలేనిదని ఆయన తేల్చిచెప్పారు. ఈ విషయంలో సీఎం స్పందించాలని, లేదంటే ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

## నార్త్ సిటీకి మెట్రో లేనట్టేనా?

### మెట్రో మూడో దశ... ఉత్త ముచ్చటే

**స్థానికుల అభ్యర్థనలు పట్టించుకోని ప్రభుత్వం**

**నార్త్ సిటీకి రెండో దశలోనే నిర్మించాలి : మేడ్చల్ మెట్రో సాధన సమితి**

**నగరంలో మెట్రో విస్తరణలో గాలి మాటలు, నీటి మూటలు అన్న చందంగా మారిపోయింది. ప్రజా ప్రయోజనాలను ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోకుండా జరుగుతున్న ప్రణాళికలపై ఆగ్రహం వ్యక్తం అవుతుంది. సుదీర్ఘకాలంగా నార్త్ సిటీకి రవాణా సౌకర్యాలు కల్పించాలని ఆందోళనలు చేస్తున్నారు. ఇక ఇచ్చిన హామీలను మరిచి... మేడ్చల్ వరకు మెట్రో ప్రతిపాదనలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టేస్తోంది. తాజాగా ఫోర్త్ సిటీ లక్ష్యంగా ప్రతిపాదించిన మెట్రో ఫేజ్-2లో నార్త్ సిటీని పరిగణనలోకి తీసుకోకుండానే రూపొందించిన డీపీఆర్‌కు రేవంత్ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. అవే ప్రతిపాదనలతో కేంద్ర సాయం కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. మూడో దశ విస్తరణలో నార్త్ సిటీకి మెట్రో అంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో ఉత్త మాటలేనని వెల్లడైంది. ఒకవేళ ప్రభుత్వం అన్నట్లు మూడో దశలో నార్త్ సిటీకి మెట్రో నిర్మించాలంటే... అప్పటికే నిర్మించిన ఎలివేటెడ్ కారిడార్‌తో సాధ్యం కాదని అభిప్రాయపడుతున్నారు. దీంతోపాటు రెండో దశ మెట్రో విస్తరణ అందుబాటులోకి రావడానికి కనీసం 8 నుంచి 12 ఏళ్లు పట్టే అవకాశం ఉండగా... కొత్త ప్రతిపాదనలకు అప్పటివరకు తావే ఉండదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.**

**- సిటీబ్యూరో, నవంబర్ 19(నమస్తే తెలంగాణ)**

గేట్ వే ఆఫ్ నార్త్ తెలంగాణగా పిలిచే హైదరాబాద్ ఉత్తర ప్రాంతానికి మెట్రో విస్తరణలో తీవ్ర అన్యాయమే జరుగుతుంది. మల్కాజిగిరి ఎంపీగా రేవంత్ రెడ్డి గెలిచిన తర్వాత... మెట్రో రైలు తీసుకువస్తానంటూ ఇచ్చిన హామీని మరిచారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా ఆ ప్రతిపాదనలకు నీళ్లొదిలేలా రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. దీంతో తమ ప్రాంతానికి తీరని అన్యాయమే జరుగుతుందని నార్త్ సిటీ వాసులు మండిపడుతున్నారు. మేడ్చల్ వరకు మెట్రోను విస్తరించాలని కొంతకాలంగా మేడ్చల్ మెట్రో సాధన సమితి ఉద్యమిస్తోంది. కానీ ఏనాడు మెట్రో సాధన సమితి ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకోలేదు. నార్త్ సిటీలో కారిడార్‌లోని ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వరకు, జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ వరకు, తార్నాక నుంచి కీసర, బోయిన్‌పల్లి నుంచి మూసాపేట్ వై జంక్షన్ వరకు ఇలా నార్త్ సిటీలో మెట్రో విస్తరించాలని స్థానికులు ఆందోళన చేస్తున్నారు. నిత్యం ప్రజాప్రతినిధులతో సంప్రదింపులు, సమావేశాలు, ఆందోళనలు, నిరసనలతో మెట్రో సాధనకు ఉద్యమిస్తున్నారు. ఇవేవి పట్టనట్లు కాగితాలకే పరిమితమైన ఫోర్త్ సిటీకి మెట్రోను విస్తరిస్తూ, మూడో దశలో నార్త్ సిటీకి మెట్రో అంటూ ప్రభుత్వం మభ్యపెడుతుందని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### స్పందించిన కేంద్ర ప్రభుత్వం..

ఫేజ్-2 కింద రూ. 23వేల కోట్లతో నగరంలో 76 కిలోమీటర్ల మేర మెట్రో లైన్‌ను విస్తరించడానికి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. ఇందులో నార్త్ సిటీని పరిగణనలోకి తీసుకోలేదు. మేడ్చల్‌కు మెట్రో విస్తరించాలని కోరుతూ 9 నెలల కిందటే ప్రధాని మోదీకి మెట్రో సాధన సమితి లేఖలతో సంప్రదింపులు చేసింది. దీనిపై స్పందించిన కేంద్రం రాష్ట్ర ఎంఏయూడీ శాఖకు లేఖతో ఆదేశాలు జారీ చేసింది. స్థానికుల అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకోవాలని రాష్ట్రానికి స్పష్టం చేసింది. కానీ అవేవి పట్టించుకోకుండానే ప్రభుత్వం ఫోర్త్ సిటీకి మెట్రో ప్రతిపాదనలతోపాటు, కేంద్రం సాయాన్ని కోరుతూ ముందుకు వెళ్తోంది.

### మూడో ఫేజ్ ఉత్త మాటలే..

నిజానికి రెండో దశ పనులు చేపట్టడానికే ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది. ముఖ్యంగా ఆర్థికపరమైన అంశాలు ఫేజ్-2ను కలవరపడేలా చేస్తున్నాయి. ఈ క్రమంలో రేవంత్ సర్కార్ మూడో ఫేజ్ విస్తరణలో నార్త్ సిటీ ఉంటుందని చెప్పడం వెనుక దాటవేసే ధోరణే కనిపిస్తోందని అభిప్రాయపడుతున్నారు. రెండో దశ పూర్తి కావడానికి కనీసం 10ఏళ్లు పట్టనుంది. ఒకవేళ మూడో దశలోనైనా మెట్రో విస్తరించాలని భావించినా.. ఆ ప్రాంతంలో అప్పటికే నిర్మితమయ్యే ఎలివేటెడ్ కారిడార్ ప్రధానమైన అడ్డుగా మారనుంది. ప్యారడైజ్ నుంచి డెయిరీ ఫాం రోడ్డు వరకు, జేబీఎస్ నుంచి తూంకుంట వరకు ప్రతిపాదిత ఎలివేటెడ్ కారిడార్ డబుల్ డెక్కర్ కాదని తేలింది. ఇక ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే నార్త్ సిటీకి మెట్రో విస్తరణ అనేది సాధ్యం కాదని వాపోతున్నారు.

### రెండో దశలోనే మెట్రో నిర్మించాలి..

రెండో దశ ప్రతిపాదనల్లోనే నార్త్ సిటీ ప్రాంతాలను పరిగణనలోకి తీసుకుని డీపీఆర్‌ను రివైజ్ చేయాలి. నార్త్ సిటీకి మూడో దశలో అవకాశం కల్పిస్తామని చెప్పడం వెనుక పెద్ద కుట్రే ఉంది. దీంతో భవిష్యత్తులో నార్త్ సిటీ మెట్రో ఆశలను నీరుగార్చే ప్రయత్నమే. చెన్నయ్ నగరానికి ఏడేళ్లుగా మెట్రో పెండింగ్‌లో ఉంటే.. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రధాని మోదీతో ఒక్కసారి సమావేశమై.. ఏకంగా రూ. 60వేల కోట్ల మెట్రో ప్రతిపాదనలకు ఆమోదం పొందారు. కానీ కేంద్రంతో సంప్రదింపులు చేయకుండా.. ఉద్దేశపూర్వకంగానే నార్త్ సిటీని రాష్ట్ర ప్రభుత్వం పక్కన పెడుతున్నది. మూడో దశ పేరిట మభ్యపెడితే.. భవిష్యత్తులో తమ ప్రాంతానికి మెట్రో నిర్మాణం సాధ్యపడదు. ఎప్పుడో మొదలైన మొదటి దఫా మెట్రో పూర్తి కావడానికి కనీసం 15ఏళ్లు పట్టింది. ఇక ప్రతిపాదనలు సిద్ధమైన ఫేజ్-2 పూర్తి కావడానికి మరో 10ఏళ్లు పట్టవచ్చు. ఇంకా ప్లానింగ్ చేయని ఫేజ్-3లో మెట్రో వస్తుందంటే ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. **- మేడ్చల్ మెట్రో సాధన సమితి**

## వ్యర్థాల తరలింపు గాడితప్పింది

### భవన నిర్మాణ వ్యర్థాలతో డంపింగ్ కేంద్రాలుగా ఖాళీ స్థలాలు, చెరువులు

**బకాయిల చెల్లింపులో జాప్యంపై గుర్రుగా ఉన్న ఏజెన్సీలు**

సిటీబ్యూరో, నవంబర్ 19(నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీలో భవన నిర్మాణ వ్యర్థాల తరలింపు ప్రక్రియ గాడి తప్పుతోంది. కూల్చివేసిన సీ అండ్ డీ (కన్‌స్ట్రక్షన్స్ అండ్ డీమాలిషన్) వ్యర్థాల తరలింపులో సమన్వయలోపం కొట్టొచ్చినట్లు కనబడుతున్నది. భవన నిర్మాణాల వ్యర్థాలను రీ సైక్లింగ్ చేసి రీయూజ్ (పునర్ వినియోగం)లోకి తీసుకువచ్చేందుకుగానూ నగరంలో జీడిమెట్ల, ఫతుల్లాగూడ, శంషాబాద్, తూంకుంటలో నాలుగు ప్లాంట్లను ఏర్పాటు చేశారు. అయితే గడిచిన కొన్ని నెలలుగా ఈ భవన నిర్మాణ వ్యర్థాల తరలింపు సజావుగా జరగడం లేదు. వాస్తవంగా ఏదైనా భవన నిర్మాణం, కూల్చివేత తాలూకా వ్యర్థాల తరలింపులో భారీ స్థాయిలో అయితే టోల్ ఫ్రీ నంబర్ 1800 120 1159లో, వాట్సప్ నంబర్ 91009 27073లో చెబితే సంబంధిత ఏజెన్సీ వారు వచ్చి వారీ వారీ ప్లాంట్లకు తీసుకువెళ్తారు. జీహెచ్ఎంసీ నిర్ధేశించిన రేటు ప్రకారం మెట్రిక్ టన్నుకు నిర్ణీత రేటును వసూలు చేస్తారు. చిన్న స్థాయిలో (లోడు కంటే తక్కువ) ఉన్న వ్యర్థాలను సంబంధిత మేస్త్రీ ఏదో చోటకు చేర్చి ఆ తర్వాత ఏజెన్సీకి అప్పగించి సంబంధిత నగదును మేస్త్రీ తీసుకుంటారు. కానీ చాలా వరకు యాజమానులు, మేస్త్రీలు.. ఖాళీ స్థలాలు, చెరువుల పక్కన, నాలాల పక్కన రాత్రికి రాత్రే డంపింగ్ చేస్తున్నారు. భవన నిర్మాణ వ్యర్థాలను ఒక చోటకు చేర్చేందుకు ఇటీవల కాలంలో 12 కలెక్షన్ పాయింట్లను ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతాల నుంచి వ్యర్థాలను జీహెచ్ఎంసీ కలెక్షన్ పాయింట్‌లో డంపింగ్ చేస్తే అక్కడ నుంచి ఏజెన్సీ తీసుకువెళుతుంది. ఇందుకు సుమారు మెట్రిక్ టన్నుకు రూ. 398.50లు, యుజర్ ఛార్జీలు రూ. 99.62లు అదనంగా వసూలు చేస్తున్నది. దీంతో జీహెచ్ఎంసీ ఆయా ఏజెన్సీలకు వ్యర్థాల తరలింపు బకాయి పడింది. దాదాపు రూ. 7కోట్లకు పైగా జీహెచ్ఎంసీ నుంచి బకాయిలు రావాల్సి ఉందని, ప్లాంట్ల నిర్వహణ భారంగా మారుతుందని ఏజెన్సీలు జీహెచ్ఎంసీకి అల్టిమేటం జారీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

### అపరిశుభ్రంగా నగరం..

గుట్టలు గుట్టలుగా పేరుకుపోయిన భవన నిర్మాణ వ్యర్థాలు దర్శనమిస్తూ నగరం అపరిశుభ్రంగా మారుతోంది. గత ప్రభుత్వం సీ అండ్ డీ ప్లాంట్లను ఏర్పాటు చేసి, సమర్థవంతంగా నిర్వహణ చేపట్టి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహణ భిన్నంగా మారిందని అనడంలో ఎలాంటి సందేహం లేదని పర్యావరణ వేత్తలు అభిప్రాయపడుతున్నారు.



## అటకెక్కిన హైడ్రా పైలట్ ప్రాజెక్ట్

**ఆ నాలుగు చెరువుల సుందరీకరణ ఊసేలేదు**

**బడ్జెట్ లేకపోవడమే కారణమా..**

**బతుకమ్మకుంట, ఎర్రకుంట సుందరీకరణపై దృష్టి**



సిటీబ్యూరో, నవంబర్ 19(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరంలో చెరువుల సుందరీకరణ, పునరుజ్జీవం అంటూ కూల్చివేతల పేరుతో హల్‌చల్ చేసిన హైడ్రాకు ఆదిలోనే హంసపాదు ఎదురైంది. తాము ప్రతిష్టాత్మకంగా తీసుకున్న చెరువుల పైలట్ ప్రాజెక్ట్ మొదట్లోనే ఆగిపోవడంతో షాక్ తగిలినట్లయింది. పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టాలనుకున్న నాలుగు చెరువుల సుందరీకరణ పనులు ప్రణాళికల దగ్గరే ఆగిపోయాయి. హైడ్రా పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఈస్ట్, వెస్ట్, నార్త్, సౌత్‌లలో ఒక్కో చెరువును ఎంపిక చేసుకుని మొదట 4 చెరువులను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ప్రాజెక్ట్‌లో బాచుపల్లి-ఎర్రగుంట చెరువు, మాదాపూర్-సున్నం చెరువు, కూకట్‌పల్లి-నల్లచెరువు, రాజేంద్రనగర్-అప్పా చెరువులను ఎంపిక చేసింది. చెరువుల సుందరీకరణను ఆరు నెలల్లో పూర్తిచేయాలనుకున్నారు. ఇందులో భాగంగా మొదట బాచుపల్లి ఎర్రగుంట చెరువు వద్ద శిథిలాల తరలింపు విమర్శలకు దారితీయడమే కాకుండా ఖర్చుతో పాటు శిథిలాలను ఎక్కడ పోయాలన్న ప్రశ్నలు ఎదురయ్యాయి. ఆ తర్వాత మిగతా మూడు చెరువుల విషయంలో కనీసం శిథిలాల తరలింపు కానీ ఇతర పునరుజ్జీవ పనుల మాటే వినిపించడం లేదు. ఈ నాలుగు చెరువులపై మొదట్లో దృష్టి పెట్టినప్పటికీ.. వాటి పునరుజ్జీవం, సుందరీకరణ పనులకు కోట్ల రూపాయలు ఖర్చవుతుందని అధికారులు అంచనా వేయడంతో బడ్జెట్ కారణంగా ఆ పనులను ఆపేసినట్లు సమాచారం.

### పైలట్ ప్రాజెక్ట్ కష్టమే..!

బెంగళూరు పర్యటన తర్వాత నల్లచెరువు, సున్నంచెరువు, ఎర్రగుంట చెరువు, అప్పా చెరువుల సుందరీకరణకు సంబంధించిన పైలట్ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలని హైడ్రా కమిషనర్ తమ బృందంతో చర్చించారు. స్టడీ టూర్ నుంచి రాగానే నాలుగు చెరువుల దగ్గర కూల్చివేతల అనంతరం అక్కడ ప్రతిరోజు ఏం జరుగుతుంది. ఎటువంటి పరిస్థితులు ఉన్నాయి.. తమకు స్థానికులు సహకరిస్తారా.. శిథిలాల తొలగింపు తర్వాత ప్రభుత్వ ఆధీనంలో ఉన్న స్థలానికి ఫెన్సింగ్ వేయడానికి అనుకూలంగా ఉంటుందా.. అనే అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో హైడ్రా కమిషనర్ సమీక్ష నిర్వహించారు. అయితే సున్నంచెరువు వద్ద కూల్చివేతల సమయంలో జరిగిన గొడవ, కోర్టు కేసులు కూడా ఉండటంతో.. ఫెన్సింగ్ వేసే వరకు ఆచితూచి అడుగు వేయాలని నిర్ణయించుకున్నారు. ఈ పరిస్థితులను అంచనా వేయడానికి పదిహేను రోజుల పాటు చెరువుల వద్ద డ్రోన్ ద్వారా సర్వే చేశారు. మరోవైపు రెవెన్యూ, ఇరిగేషన్, హైడ్రా అధికారుల బృందం అక్కడకు వెళ్లి పరిస్థితులను పరిశీలించారు. ఇదే సమయంలో నాలుగు చెరువులను సుందరీకరించడానికి అయ్యే ఖర్చుపై అంచనా వేసినట్లు తెలిసింది. చెరువుల అభివృద్ధికి అయ్యే నిధులెంత.. అసలు ఏ మేరకు ఎలా అభివృద్ధి చేయగలమనే అంశాలపై సంబంధిత శాఖ అధికారులతో కమిషనర్ అంతర్గతంగా సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత చెరువుల సుందరీకరణ ముచ్చటే పక్కకు పోయింది. ఇప్పుడంతా రోడ్లు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై హైడ్రా దృష్టిపెడుతోంది.

### మొదట రెండు చెరువులపైనే దృష్టి..!

పైలట్ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయడానికి అనుకూలమైన పరిస్థితులు లేకపోవడంతో అంబర్‌పేటలోని బతుకమ్మకుంట, తార్నాకలోని ఎర్రకుంటలపై హైడ్రా దృష్టి పెట్టింది. ఈ నేపథ్యంలో బతుకమ్మకుంటను సుందరీకరించడానికి పనులు మొదలుపెట్టింది. బతుకమ్మకుంటను సుందరీకరించడానికి కావలసిన సంస్థల భాగస్వామ్యం కోరుతున్నట్లు సమాచారం. ఇందుకోసం స్థానిక కాంగ్రెస్ నేతలు వీహెచ్, రోహన్‌రెడ్డి సహకారం తీసుకోవాలనుకుంటున్నట్లు తెలిసింది. ఈ విషయంపై ఇప్పటికే వారితో కమిషనర్ రంగనాథ్ మాట్లాడారని, బడ్జెట్ ఇతర అంశాలపై కూడా చర్చించారని తెలిసింది. మరోవైపు తార్నాకలోని ఎర్రగుంట చెరువు అభివృద్ధికి కూడా ఎలాంటి అడ్డంకులు లేకపోవడంతో పాటు కొన్ని ఆక్రమణలు తొలగించాలని స్థానికులే కోరుతుండటంతో ఈ రెండు చెరువులపై హైడ్రా దృష్టిపెడుతోంది. అయితే బతుకమ్మకుంట, ఎర్రగుంటలను ఎలా సుందరీకరించాలనే విషయంపై బెంగళూరు సామాజిక కార్యకర్త ఆనంద్‌మల్లిగవాడ్‌తో రంగనాథ్ చర్చించారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ హయాంలో సుందరీకరించిన రెండు చెరువులను సోమవారం సందర్శించారు. బతుకమ్మకుంట, ఎర్రగుంట చెరువుల సుందరీకరణను వేగవంతంగా పూర్తిచేయాలనుకుంటున్నట్లు తెలిసింది. వీటి తర్వాత తక్కువ విస్తీర్ణంలో ఉన్న చెరువులను ఎంపిక చేసుకుని వాటిని సుందరీకరించాలనుకుంటున్నట్లు హైడ్రా అధికారి ఒకరు చెప్పారు.



బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవ ఏర్పాట్లపై సమావేశమైన ఎమ్మెల్యేలు

## 3న మేడ్చల్ బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

మేడ్చల్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): డిసెంబర్ 3న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బీఆర్ఎస్ కార్యాలయాన్ని వర్కింగ్ పార్టీ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రారంభించనున్నారు. ప్రారంభోత్సవ ఏర్పాట్లపై కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ క్యాంపు కార్యాలయంలో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు మంగళవారం సమావేశమయ్యారు. జిల్లా నలుమూలల నుంచి పార్టీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, మహిళా విభాగం సభ్యులు, యువజన విభాగం నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేసేలా జిల్లాలోని నియోజకవర్గాల నుంచి భారీగా కార్యకర్తలు తరలివచ్చేలా ప్రణాళికను ఎమ్మెల్యేలు సిద్ధం చేశారు. ఈ సమావేశంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్, ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.